
సాక్షి
శ్రీకాకుళం
మంగళవారం • 7 • జనవరి • 2025



రోడ్డున పడేశారు..

చిన్నజొన్నవలసలో అక్రమ నిర్మాణాలు కూలగొట్టేశారు. 21 కుటుంబాలు నిరాశ్రయులయ్యాయి.

- 8లో



హవ్వ..

టీడీపీ నేత తన ఇంటికి రోడ్డేసుకున్నారు. అనుమతులు కూడా లేవు.

- 8లో

వక్ఫ్ ఆస్తులపై సర్వే చేపట్టండి

శ్రీకాకుళం పాతబస్టాండ్: వక్ఫ్ ఆస్తులపై సమగ్ర సర్వే చేపట్టి రెవెన్యూ అధికారుల సమక్షంలో హద్దులు నిర్వహించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయంలో సోమవారం వక్ఫ్ ఆస్తుల పరిరక్షణ కమిటీ సమావేశం జిల్లా మైనార్టీ అధికారి మెంబర్ అండ్ కన్వీనర్ ఆర్ ఎస్ జాన్ సమక్షంలో జరిగింది. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఉన్న అన్ని వక్ఫ్ ఆస్తులను సర్వే శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఆధ్వర్యంలో సర్వే చేయాలన్నారు. ఆక్రమణకు గురైతే కేసు నమోదు చేయాలన్నారు.

న్యూస్‌రీల్

220 మంది ఎంపిక



అభ్యర్థి ఛాతీ కొలత పరిశీలిస్తున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

ఎచ్చెర్ల క్యాంపస్: ఏపీ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పోలీస్ కానిస్టేబుల్ అభ్యర్థుల దేహదారుఢ్య పరీక్షలు ఎచ్చెర్ల ఆర్మ్‌డ్ రిజర్వ్ మైదానంలో కొనసాగుతున్నాయి. ఎంపికలకు సోమవారం 631 మంది హాజరు కావాల్సి ఉండగా, 364 మంది హాజరయ్యారు. ఇందులో తుది రాత పరీక్షకు 220 మంది ఎంపికయ్యారు. నిబంధనల మేరకు ఎంపిక ప్రక్రియ నిర్వహించారు. సర్టిఫికెట్ వెరిఫికేషన్, ఎత్తు, ఛాతీ కొలత, 1600 మీటర్లు, 100 మీటర్లు పరుగుపందెం, లాంగ్ జంప్ నిర్వహించారు. సెలవు రోజుల్లో మినహా ఈ నెల 18వ తేదీ వరకు ఎంపికలు నిర్వహిస్తారు. మంగళవారం యథావిధిగా ఎంపికలు కొనసాగుతాయి. ఈ నెల 8న నిర్వహించాల్సిన ఎంపికలు 11వ తేదీకి వాయిదా వేశారు. వైకుంఠ ఏకాదశి సందర్భంగా పోలీస్ శాఖ భద్రత పనుల్లో అవసరం మేరకు ఈ ఎంపిక వాయిదా వేశారు. మిగతా రోజుల్లో కాల్ లెటర్‌లో పేర్కొన్న మేరకు అభ్యర్థులు హాజరు కావాల్సి ఉంటుంది. జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి ఎంపిక ప్రక్రియ పర్యవేక్షిస్తున్నారు.

విద్యార్థినితో మాస్టారు అసభ్య చాటింగ్!

- పోలీస్‌స్టేషన్‌కు చేరిన పంచాయితీ
- టీడీపీ నేతల రాజీయత్నం

నందిగాం: నందిగాం మండలంలోని హరిదాసుపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయుడు గత నెల 31రాత్రి ఓ విద్యార్థినితో అసభ్యంగా చాటింగ్ చేసిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. ఈ వ్యవహారం పోలీస్‌స్టేషన్‌కు చేరుకోవడంతో టీడీపీ నేతలు రాజీయత్నాలకు దిగడం చర్చనీయాంశమైంది. వివరాల్లోకి వెళితే.. హరిదాసుపురం డ్రిల్ మాస్టారు డిసెంబరు 31 అర్ధరాత్రి పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న బాలిక సెల్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షల పేరుతో అసభ్య చాటింగ్ చేసినట్లు సమాచారం. అయితే బాలిక కుటుంబసభ్యులు చాటింగ్ చూసి, తర్వాత రోజు పాఠశాలకు వెళ్లి ప్రధానోపాధ్యాయుడు, కొంతమంది గ్రామస్తుల సమక్షంలో డ్రిల్ మాస్టర్‌ను నిలదీయడమే కాకుండా నందిగాం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశా రు. వ్యవహారం పోలీస్‌స్టేషన్‌కు చేరుకోవడంతో కొంతమంది తెలుగుదేశం నాయకులు ఉపాధ్యాయుడు తరఫున వకల్తా పుచ్చుకుని రాజీ ప్రయత్నాలు ప్రారంభించారు. బాలిక తండ్రిపై తీవ్ర ఒత్తిడి తెస్తున్నా.. ససేమిరా అంటున్నట్లు తెలుస్తోంది.

అన్యాయంగా తొలగించారు..



కలెక్టర్‌కు తమ సమస్య వివరిస్తున్న తొలగించిన ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు

ఎచ్చెర్ల క్యాంపస్: బీఆర్ఏయూలో పనిచేస్తున్న 34 మంది ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను అన్యాయంగా వీసీ రజని, రిజిస్ట్రార్ సుజాత తొలగించారని, రోడ్డున పడ్డ తమను ఆదుకోవాలని ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌కు విన్నవించారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించిన మీ కోసం (పబ్లిక్ గ్రీవెన్స్ సెల్)లో తమ సమస్యను సోమవారం కలెక్టర్‌కు చెప్పుకున్నారు. ఏడాది పనిచేశామని, 11 నెలల వేతనం ఇచ్చా రని అన్నారు. ముందస్తు సమాచారం ఇవ్వలేదని, నిబంధనల మేరకు ఔట్ సోర్సింగ్ ప్రభుత్వ జీఓ మేరకు మూడేళ్ల పాటు రెన్యువల్ చేయాలని, గుంటూరుకు చెందిన ఏజీఎస్ మేనేజ్ మెంట్ సర్వీసెస్ సంస్థ రెన్యువల్‌కు దరఖాస్తు చేసుకున్నా అధికారులు స్పందించ లేదని అన్నారు. తమను ఉద్యోగాల్లో కొనసాగించేలా ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లి సమస్య పరిష్కరించాలని ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు కోరారు. దీంతో స్పందించిన కలెక్టర్ వర్సిటీ అధికారులకు సీసీ ద్వారా ఫోన్ చేయించగా, వారు లిఫ్ట్ చెయ్యలేదు. తనను కలవాలని వారికి సమాచారం ఇవ్వాలని సిబ్బందికి సూచించారు.

ఆందోళన వద్దు.. ముందస్తు జాగ్రత్తలే ముద్దు





అరసవల్లి: చైనాలో కొత్తగా వ్యాప్తి చెందుతున్న వైరస్‌పై సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. కరోనా రోజులను జ్ఞప్తికి తెచ్చేలా తాజాగా హ్యూమన్ మెటా న్యూమో వైరస్ (హెచ్ఎంపీవీ) పంజా విప్పుతోంది. మన దేశంలోనూ బెంగళూరులో సోమవారం ఒక కేసు నమోదైనట్లుగా గుర్తించడంతో ఈ కొత్త వైరస్‌పై సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. ఇదిలావుంటే ఈ కొత్త వైరస్‌పై ఎలాంటి ఆందోళన అవసరం లేదని ప్రభుత్వం చెబుతోంది. ముందస్తు జాగ్రత్తలు తీసుకుని సంక్రాంతి జరుపుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

రిమ్స్‌లో ప్రత్యేక వార్డుకు ఏర్పాట్లు

శ్రీకాకుళం: శ్రీకాకుళం సర్వజన ఆసుపత్రి (రిమ్స్)లో హెచ్ఎంపీవీ రోగుల కోసం ప్రత్యేక వార్డును ఏర్పాటు చేయనున్నారు. ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు రాకపోయినప్పటికి ముందు జాగ్రత్త చర్యగా 20 పడకలతో ఆక్సిజన్ సౌకర్యాన్ని కల్పించి వార్డులను సిద్ధం చేస్తున్నారు. కోవిడ్ తీవ్ర రూపం దాల్చిన నుంచి ఇప్పటి వరకు ఈ వార్డును ఆయా రోగుల కోసమే శాశ్వతంగా ఉంచారు. దానికి తాళాలు వేసి ఉంచడంతో తిరిగి వార్డును శుభ్రం చేసే పనిలో రిమ్స్ సిబ్బంది ఉన్నారు.



శ్రీకాకుళం: రిమ్స్‌లోనే కోవిడ్ కోసం ఉన్న ప్రత్యేక వార్డు

మాస్కుల వినియోగమే ముందు జాగ్రత్త



వైరస్‌ల బారిన పడకుండా ఉండాలంటే మాస్కుల వినియోగం తప్పనిసరి. ఇదే ముందస్తు జాగ్రత్తగా భావించాలి. కోవిడ్ తరహాలో వైరస్ వ్యాప్తి చెందుతుందా లేదా మార్గదర్శకాలేంటి అనే అంశాలపై కేంద్ర ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు రానున్నాయి. వాటిని బట్టి జిల్లాలో చర్యలు చేపడతాం. ప్రజలు ఆందోళన చెందకుండా ముందస్తు జాగ్రత్తలు పాటించండి. జన సమూహంలోకి వెళ్లేటప్పుడు జాగ్రత్తలు వహించాలి.

– టీవీ బాలమురళి కృష్ణ, డీఎంహెచ్‌ఓ

ప్రభుత్వం నుంచి ఆదేశాలు లేవు

ప్రత్యేక వార్డు ఏర్పాటు చేయలన్నా ఆదేశాలు లేవు. అయినా 20 పడకలతో శాశ్వత వార్డు కోవిడ్ కోసం ఉంది. దానినే హెచ్ఎంపీవీ కోసం వినియోగిస్తాం.

– డాక్టర్ షకీల, సూపరింటెండెంట్, రిమ్స్

ఘడియ ఘడియల్లోన ఓ గండమై..



బాలికను నమ్మించి మోసం చేసిన ఓ ప్రబుద్ధుడు 'నేడు టీడీపీ కార్యకర్తను.. నన్నేం చేయలేరు' అని ధైర్యంగా చెబుతున్నాడు. పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పించాల్సిన గురువు దారి తప్పితే.. అధికార పార్టీకి చెందిన చోటా నాయకులు కేసును నీరు గార్చేందుకు ప్రయత్నిస్తున్నారు. పుట్టిన రోజు పార్టీ కోసం వెళితే ఏకంగా ఇద్దరిపై లైంగిక దాడికి పాల్పడి.. కేసు నుంచి తప్పించుకోవడానికి రాజకీయ పలుకుబడిని వాడుతున్నారు. తన గ్రూపులో డ్యాన్స్ వేయడం లేదని ఓ ప్రజా ప్రతినిధి అర్ధ రాత్రి దారి కాచి మరీ దాడి చేస్తాడు. జిల్లాలో అతివలకు రక్షణ కరువైంది. పోలీసులు ఎంతగా ప్రయత్నిస్తున్నా.. మితిమీరిన రాజకీయ జోక్యం వారి ముందర కాళ్లకు బంధనాలు వేస్తోంది.

- అతివలపై నానాటికీ పెరుగుతున్న దాడులు
- అరికట్టేందుకు పోలీసుల విశ్వ ప్రయత్నాలు
- పోలీసుల కాళ్లకు బంధనాలు వేస్తున్న 'రాజకీయ' సంబంధాలు

శ్రీకాకుళం క్రైమ్ :

ఒంటరిగా రహదారులపై వెళ్తున్న మహిళలకు రక్షణ లేదు.. ఎవడు వచ్చి గొలుసులు తెంపుకుని వెళ్లిపోతాడో అని భయం. కళాశాలలకు, స్కూళ్లకు వెళ్తున్న బాలికలకు భరోసా లేదు. ఏ ఆకతాయి వచ్చి అల్లరి చేస్తాడో అని వణుకు. ఇళ్లలో ఉన్న ఆడపడుచులకు కూడా భద్రత లేదు.. ఏ అగంతకుడు వచ్చి చోరీ చేస్తాడో అని ఆందోళన. జిల్లాలో ఎన్నడూ చూడని విధంగా మహిళలకు భద్రత కరువైపోతోంది. ఓ వైపు పోలీసులు అరాచకాలు అరికట్టేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నా.. చాలా కేసుల్లో నిందితులు రాజకీయ పలుకుబడి ఉపయోగించి తప్పించుకుంటున్నారు.

అవగాహన కల్పిస్తున్నా..



మహిళలపై పెరుగుతున్న నేరాలపై ఎస్పీ మహేశ్వరరెడ్డి నేరవార్షిక గణాంకాలు వెల్లడించేటప్పుడు మాట్లాడారు. పాఠశాలలు, కళాశాల విద్యార్థులకు సంకల్పం కార్యక్రమంలో భాగంగా అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని, ఆకతాయిల ఆట కట్టించడానికి విజుబుల్ పోలీసింగ్, గస్తీ నిర్వహిస్తున్నామన్నారు. పోలీసులు ఎప్పటికప్పుడు గ్రామాల్లో సందర్శించి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. కానీ పరిస్థితుల్లో ఆశించిన స్థాయిలో మార్పు కనబడడం లేదు.

హత్యలు.. అదృశ్యాలు.. చోరీలు.. వేధింపులు



చైన్‌స్నాచర్ దాడిలో గాయపడిన టీచర్ (ఫైల్)

- గత ఏడాది డిసెంబరు 16న ఆమదాలవలస మండలం గాజుల కొల్లివలసలో మహిళను దారుణంగా హత్య చేశారు.
- గత అక్టోబరులో తమ డ్యాన్స్ గ్రూపులో ఉన్న బాలిక వేరే గ్రూపుతో వెళ్తుందని కక్ష కట్టి పలాస మండలం తెలుగు యువత అధ్యక్షులు కిక్కర ఢిల్లీరావు అర్ధరాత్రి దారికాచి ఆ బాలిక, ఆమె తల్లిపై దౌర్జన్యానికి దిగారు.
- గత ఏడాది కవిటి సమీపంలో ఓ చైన్ స్నాచర్ తన గ్రామానికే చెందిన మహిళా ఉపాధ్యాయురాలి తల బద్దలుగొట్టి మరీ గొలుసు తెంపాలని చూశాడు.
- శ్రీకాకుళంలో ఓ వృద్ధురాలి మెడపై కత్తితో బెదిరించి నోట్లో గుడ్డలు కుక్కి తాళ్లతో చేతులు, కాళ్లు మంచానికి కట్టి ఒంటిపై ఉన్న బంగారాన్నంతా తీసుకెళ్లిపోయారు.
- గత ఏడాది సెప్టెంబరు 25న సోంపేట మహదేవిపేటలో పట్టపగలు గుర్తు తెలియని వ్యక్తి ఇంట్లో ప్రవేశించి మహిళ మెడకు కత్తిపెట్టి ఐదు తులాల బంగారాన్ని తెంపుకుపోయాడు.

కేసుల్లో కొన్ని..



- గత ఏడాది అక్టోబరు 19 రాత్రి కాశీబుగ్గ కేంద్రంగా ఇద్దరు బాలికలను పుట్టిన రోజు వేడుకలకని పిలిచి ఇద్దరు యువకులు లైంగిక దాడి పాల్పడ్డాడు.
- గత అక్టోబరులో మహిళా కానిస్టేబుల్‌పై ఎస్ఐ అసభ్యకరంగా ప్రవర్తించడంతో ఆమె ఎస్పీకి ఫోన్‌లో ఫిర్యాదు చేశారు. ప్రస్తుతం ఆ ఎస్ఐ వీఆర్‌లో ఉన్నారు.
- ఇటీవల జిల్లాకేంద్రంలోని ఆర్కీకాలింగ్ పేరిట మైనర్ బాలికల వసతి గృహాల్లో సీసీ కెమెరాలు పెట్టడమే కాక వారిని హింసించినట్లు బీవీ రమణపై బాధిత బాలికలు ఎస్పీ గ్రీవెన్సులో ఫిర్యాదు చేశారు.
- తాజాగా ఆమదాలవలస మండలంలో తొమ్మిదో తరగతి విద్యార్థినిని ఇంట్లో తల్లిదండ్రులు లేని సమయం చూసి మత్తుమందు కలిపి లైంగిక దాడి చేసినట్లు వెలుగులోకి వచ్చింది.
- టెక్కలిలో ఓ టీచర్ పిల్లలకు అసభ్యకర సందేశాలు పంపిస్తూ దొరికిపోయారు.



మిస్సింగ్ కేసుల్లో మహిళలే అధికం..

2024లో మొత్తం మిస్సింగ్ కేసులు: 408

మహిళలు 225

బాలికలు 78



వీరిలో 266 మంది జాడను పోలీసులు కనిపెట్టారు.

ఏడాది	మహిళలపై నేరాలు	పోక్సో కేసులు
2024	462	38

పొందూరులో ప్రబలిన డయేరియా



పొందూరు సీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న బాలుడిని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ

పొందూరు: పొందూరులో డయేరియా వ్యాధి చాప కింద నీరులా వ్యాపిస్తోంది. డయేరియా ప్రబలుతూ రోజు రోజుకూ విస్తరిస్తూ పోతోంది. మూడు రోజుల క్రితం డయేరియా వ్యాధి సోకడంతో బాధితులను పొందూరు ప్రభుత్వ ఆస్పత్రికి తర్వాత శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. ప్రస్తుతం స్థానిక కస్పావీధిలో 15 మంది వరకు డయేరియాతో బాధపడుతున్నారు. బాధితులను పొందూరు సీహెచ్‌సీకి తరలించి చికిత్స అందించారు. వ్యాధి తీవ్రత పెరుగుతుండటంతో తాడివలస పీహెచ్‌సీ వైద్యుడు రమేష్‌నాయుడు ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది కస్పావీధిలో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. కస్పావీధిలో డయేరియా వ్యాధి ప్రబలతుండటంతో ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్, డీఎంహెచ్‌ఓ టీవీ బాలమురళి కృష్ణతో కలిసి వీధుల్లో తిరిగి బాధితులను పరామర్శించారు. సీహెచ్‌సీ, పీహెచ్‌సీల సిబ్బందికి ఎమ్మెల్యే పలు సూచనలిచ్చారు. రానున్న పండుగ వాతావరణంలో డయేరియా కేసులు పూర్తిగా ఉండకూడదని వైద్య సిబ్బందికి, పంచాయతీ సిబ్బందికి చెప్పారు. అనంతరం డీఎంహెచ్‌ఓ పొందూరు సీహెచ్‌సీలో డయేరియా లక్షణాలతో చికిత్స పొందుతున్న బాలుడిని పరామర్శించారు.

మినీ జాబ్‌మేళా వాయిదా

టెక్కలి: టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం జరగనున్న మినీ జాబ్‌మేళాను తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు ప్రిన్సిపాల్ టి.గోవిందమ్మ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. కొన్ని అనివార్య కారణాలతో జాబ్‌మేళాను రద్దు చేస్తున్నట్లు వెల్లడించారు. తదుపరి జాబ్‌మేళా నిర్వహణపై సమాచారం అందజేస్తామని పేర్కొన్నారు.

ఓటర్ల తుది జాబితా రెడీ



శ్రీకాకుళం పాతబస్టాండ్: ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ అనంతరం భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటర్ల తుది జాబితా(ఎస్ ఎస్ ఆర్ 2025)ను జిల్లా ఎన్నికల అధికారి వారి తరపున జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వరరావు ప్రకటించారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం సాయంత్రం ఈ మేరకు విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. జిల్లా వ్యాప్తంగా జనవరి 5వ తేదీ నాటికి 18,80,065 మంది ఓటర్లుగా నమోదు చేసుకున్నట్లు చెప్పారు. 9,31,640 మంది పురుష ఓటర్లు, 9,48,299 మంది మహిళా ఓటర్లు, 126 మంది ఇతరులు ఉన్నట్లు వివరించారు. 2025 లో 18-19 వయసు గల యువత 19,315 మంది ఎలక్టోరల్స్ గా నమోదు చేసుకున్నట్లు, 80 ఏళ్లు దాటినవారు 31,609 మంది ఉన్నారని పేర్కొన్నారు. ఎప్పటిలాగే జిల్లాలో పురుషుల కంటే మహిళా ఓటర్లే అధిక సంఖ్యలో ఉండటం విశేషమని వెంకటేశ్వరరావు అన్నారు, ఆయతనోపాటు సి సెక్షన్ సూపరింటెండెంట్ రాజేశ్వరరావు ఉన్నారు.

నియోజకవర్గం	పురుష ఓటర్లు	మహిళలు	ఇతరులు
ఇచ్ఛాపురం	1,31,396	1,38,165	17
పలాస	1,07,496	1,12,414	21
టెక్కలి	1,17,977	1,18,694	09
పాతపట్నం	1,12,513	1,13,168	09
శ్రీకాకుళం	1,35,562	1,38,333	29
ఆమదాలవలస	96,094	97,610	15
ఎచ్చెర్ల	1,23,370	1,21,988	13
నరసన్నపేట	1,07,232	1,07,927	13

'మాకు రక్షణ కల్పించండి'



ఎస్పీ కార్యాలయం ముందు ఫిర్యాదు పత్రంతో బాధిత దంపతులు

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లా కేంద్రంలోని బలగ మెట్టు కూడలి డీసీసీబీ బ్రాంచి సమీపంలో ఓ ఇంటి యజయానికి కొందరు విలేకరులంటూ చెప్పుకుని డబ్బులు డిమాండ్ చేసిన సంగతి తెలిసిందే. ఈ అంశంపై రెండో పట్టణ పోలీసులు ఇప్పటికే ఐదుగురిపై కేసు నమోదు చేయగా బాధిత దంపతులు సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డిని కలవడానికి వచ్చారు. ఆయన లేకపోవడంతో తమ కుటుంబానికి ప్రాణ రక్షణ కల్పించాలంటూ డీఎస్పీ సీహెచ్ వివేకానందకు విన్నవించారు. పాల వ్యాపారం చేసుకుంటూ తమ కుటుంబం బతుకుతోందని, ఇద్దరు కుమార్తెలు ఉన్నారని బాధిత దంపతులు పేర్కొన్నారు. మతిస్థిమితం లేని తన మరిది కోసం ఇల్లు కట్టుకుంటుంటే అర్ధరాత్రి వచ్చి డబ్బుల కోసం బెదిరించారని బాధితురాలు సౌజన్య ఆవేదన వ్యక్తం చేశారు. డోల అప్పన్న అనే వ్యక్తి కూడా అక్కడకు చేరి వారితో కలిసిపోయారని తెలిపారు. వారి బెదిరింపులకు బెదిరిపోయిన తన భర్త సుగర్ లెవెల్స్ డౌన్ అయిపోయాయని, పని కోసం వచ్చిన వాళ్లను కూడా వారు బెదిరించారని ఫిర్యాదు చేశారు. భవిష్యత్‌లో వారు తమను ఇబ్బంది పెట్టకుండా రక్షణ కల్పించాలని కోరారు.

తప్పుడు కేసులపై చర్యలు తీసుకోవాలి

తమపై తప్పుడు అట్రాసిటీ కేసు పెట్టి ఇరికించాలని చూసిన బిడ్డిక రాజారావుపై, అతడిని ప్రోత్సహించిన డోల అప్పన్న, తిత్తి ప్రవీణ్‌లపై కేసులు నమోదు చేయాలని అగ్నివర్ష దినపత్రిక ఎడిటర్ నాగేశ్వర ఈశ్వరరావు, ఏపీ న్యూస్ దినపత్రిక వర్కింగ్ ఎడిటర్ మొకర మల్లేశ్వరరావులు డీఎస్పీ సీహెచ్ వివేకానందను కోరారు. ఎస్సీ, ఎస్టీ చట్టాన్ని బూచిగా చూపి భయపెట్టడం బిడ్డిక రాజారావు, డోల అప్పన్న, తిత్తి ప్రవీణ్‌ల దందాల్లో ఓ భాగమని, వారి అక్రమాలు, వారు చేస్తున్న తప్పుడు ఫిర్యాదులపై పోలీసుల వద్దకు వచ్చేందుకు ఎవరూ సాహసించడం లేదన్నారు. అప్పన్న, ప్రవీణ్‌ల సూచనలతో ఖాళీ జాగాలను కబ్జా చేయడం రాజారావుకు నిత్యకృత్యమని, శాంతినగర్ కాలనీలో ఇలానే ఓ స్థలాన్ని కబ్జా చేసి ఫేక్ మానవ హక్కుల బోర్డు తగిలించారని, భూ వివాదాల్లో తలదూర్చడం, అమాయకులను అట్రాసిటీ కేసులు పెడతామని బెదిరించడం వీరి దందాల్లో భాగమన్నారు. వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో కోరారు.

● డ్వాక్రా బజార్



జిల్లా కేంద్రంలో సోమవారం డ్వాక్రా బజారు ప్రారంభమైంది. మున్సిపల్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన డ్వాక్రా బజార్‌లో రకరకాల స్టాళ్లు ఏర్పాటు చేశారు. తినుబండారాల నుంచి వస్త్రాల వరకు, ఆట బొమ్మల నుంచి ప్రత్యేక గిరిజన ఉత్పత్తుల వరకు అన్నీ ఆకట్టుకుంటున్నాయి. – శ్రీకాకుళం పాతబస్టాండ్

● అయ్యగారికి దండం పెట్టు..



డూడూ బసవన్నల సందడి మొదలైంది. జిల్లాకేంద్రంలోని ఓ చాయ్ షాపు వద్ద ఇలా కనిపించింది. యజమాని తన స్వరంతో పాటలు వినిపించి ఆకట్టుకున్నాడు.

– శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ)

రంగోయిలో జిల్లా స్థాయి జానపద పాటల పోటీలు



పలాస: రంగోయి గ్రామంలో ఈ నెల 11న జిల్లా స్థాయి జానపద పోటీలు నిర్వహిస్తున్న ట్టు గిడుగు రామ్మూర్తి తెలుగు భాషా, జానపద కళాపీఠం వ్యవస్థాపక అధ్యక్షుడు బద్రి కూర్మారావు ఓ ప్రకటనలో తెలిపారు. జానపద గేయాలు పోటీలు నిర్వహిస్తున్నామని, ఇందులో సంప్రదాయ జానపద పాటలు మాత్రమే పాడాలని తెలిపారు. ప్రథమ బహుమతి కింద రూ.5వేలు, ద్వితీయ బహుమతి రూ.3 వేలు, తృతీయ బహుమతి రూ .2వేలతో జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలను అందజేస్తారన్నారు. ఆసక్తి గల గాయకులు ఈ నెల 9 లోగా తమ పేర్లను నమోదు చేసుకోవాలని చెప్పారు. వివరాలకు ఫోన్ నంబర్లు 8309077607, 8790055303, 9441011213ను సంప్రదించాలని ఆయన కోరారు.

● పండగ సంత



పండగ సందర్భంగా సంతలు కిక్కిరిసిపోతున్నాయి. లావేరు మండలంలోని బుడుమూరు గ్రామంలో సోమవారం జరిగిన సంతకు వందలాదిగా జనం తరలివచ్చారు. – ఎచ్చెర్ల

క్లుప్తంగా

12న ఉత్తరాంధ్ర స్థాయి క్విజ్ పోటీలు

కంచిలి: మండలంలోని పెద్దకొజ్జిరియా గ్రామంలో ఈనెల 12వ తేదీన స్వామి వివేకానంద జయంతి పురస్కరించుకొని ఉత్తరాంధ్ర స్థాయి క్విజ్ పోటీలు నిర్వహించనున్నట్లు స్థానిక స్వామి వివేకానంద యువజన సంఘం సభ్యులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజున స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో ఈ పోటీలను నిర్వహించనున్నామని పేర్కొన్నారు. ప్రతీ టీమ్‌లో నలుగురు సభ్యులు ఉండాలని, ప్రవేశ రుసుం లేదని, భోజన సదుపాయం కల్పిస్తామని, తుది నిర్ణయం న్యాయనిర్ణేతలదేనని పేర్కొన్నారు. ఉదయం 10 గంటలకు 50 మార్కులతో స్క్రీనింగ్ పరీక్ష ఉంటుందని, అందులో ఎంపికైన టాప్ 10 టీమ్స్ మెయిన్స్ రౌండ్‌లో పాల్గొంటారని తెలిపారు. ఆసక్తి ఉన్న టీంలు 90109 02091, 98665 81937, 90103 03454 నంబర్లను సంప్రదించాల్సిందిగా సూచించారు.

జాతీయ స్థాయి పోటీలకు డొంకూరు విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ఇచ్ఛాపురం రూరల్: మండలంలోని డొంకూరు మత్స్యకార గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు జాతీయ స్థాయి అథ్లెటిక్స్, ఖోఖో పోటీలకు ఎంపికయ్యారు. గత నెలలో ఏలూరులో జరిగిన రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ అథ్లెటిక్స్ పోటీల్లో అండర్-14 షాట్‌పుట్ బాలుర విభాగంలో బి.శరత్ చంద్ర 12.45 మీటర్స్‌లో రజిత పతకం పొందింది, జార్ఖండ్ రాష్ట్రం రాంచీ వేదికగా ఈనెల 11 నుంచి 15 వరకు జరగబోయే జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో జిల్లా తరుపున పాల్గొంటున్నాడు. అదేవిధంగా పల్నాడు జిల్లా వేదికగా అండర్-14 బాలికల ఖోఖో రాష్ట్రస్థాయిలో జరిగిన పోటీలో జిల్లా తరుపున అసమాన ప్రతిభను కనబర్చి రజిత పతకం పొందిన డి.మీనా, మహారాష్ట్ర కొల్హాపూర్ వేదికగా ఈనెల 10 నుంచి 14 వరకు జరగబోయే జాతీయ స్థాయి ఖోఖో పోటీల్లో జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్నట్లు ప్రధానోపాధ్యాయురాలు జి.సరోజిని తెలిపారు. ఈ సందర్భంగా జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు బి.శరత్‌చంద్ర, డి.మీనాలను సోమవారం పాఠశాల ఆవరణలో ఉపాధ్యాయులు, స్కూల్ పేరెంట్స్ కమిటీ సభ్యులు అభినందించారు. ఈ సందర్భంగా కోచ్‌గా వ్యవహరిస్తున్న వ్యాయామోపాధ్యాయులు వజీర్ అహ్మద్‌ను అభినందించారు. కార్యక్రమంలో స్కూల్ పేరెంట్స్ కమిటీ చైర్మన్ కె.జానకిరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'పెన్షనర్ల సమస్యలు పరిష్కరిస్తాం'

శ్రీకాకుళం అర్బన్: పెన్షనర్ల సమస్యలు పరిష్కరించడంలో సత్వర చర్యలు తీసుకుంటామని పెన్షనర్ ఉద్యోగ సంఘ నాయకులకు జిల్లా ఖజానాశాఖ ఉపసంచాలకులు సి.రవికుమార్ అన్నారు. ఏపీ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా, సిటీ బ్రాంచి సంయుక్తంగా సోమవారం శ్రీకాకుళంలోని ఎన్‌జీఓ కార్యాలయంలో ఆ సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎంఎస్ఆర్ఎస్ ప్రకాశరావు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెన్షనర్లకు అన్ని రకాలయిన సేవా కార్యక్రమాలు చేపడుతున్నారని అన్నారు. విశ్రాంత ఉద్యోగుల సంఘ జిల్లా అధ్యక్షుడు సోమసుందరరావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రకాశరావులు మాట్లాడుతూ సోమవారం నుంచి శనివారం వరకూ ప్రతిరోజూ ఎన్‌జీఓ కార్యాలయంలో పెన్షనర్ల లైఫ్ సర్టిఫికెట్‌లను పూర్తి చేసుకోవాలన్నారు. పెన్షనర్లు ఎవరైనా కదలలేని స్థితిలో ఉన్న వారికి ఇంటికి వెళ్లి లైఫ్ సర్టిఫికెట్లు చేస్తామని, సభ్యులు తెలియజేస్తే పూర్తి చేస్తామని తెలిపారు.

నియామకం



గొర్లె సూర్యారావు

పొందూరు: ఉత్తరాంధ్ర జిల్లాల ఎరుకుల సేవా సంఘం కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పొందూరులోని ఎరుకుల కాలనీకి చెందిన గొర్లె సూర్యారావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. విశాఖలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.శ్రీనివాసరావు, ఉత్తరాంధ్ర జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.రమణమూర్తి, దాసరి నారాయణమ్మ ఆధ్వర్యంలో ఎన్నిక నిర్వహించారు.

అర్జీల పరిష్కారానికి ప్రాధాన్యం



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తదితరులు

- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్
- మీ కోసంలో 84 అర్జీల స్వీకరణ

శ్రీకాకుళం పాతబస్టాండ్: మీకోసం (ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ)లో స్వీకరించే అర్జీలు పరిష్కారానికి అత్యధిక ప్రాధాన్యమివ్వాలని, అర్జీదారుల సమస్యలను వేగవంతంగా పరిష్కరించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. పట్టణంలోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) మీకోసం కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు.

కార్యక్రమంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వరరావు, జిల్లా పరిషత్ సీఈవో శ్రీధర్ రాజుతో కలిసి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారుల నుంచి విజ్ఞప్తులు స్వీకరించారు. ప్రజల సంక్షేమం కోసం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలు, రెవెన్యూ, పౌర సరఫరాల సేవలు, పేదలందరికీ ఇళ్లు పథకం కింద పట్టాల పంపిణీ, ఇళ్ల మంజూరు, పెన్షన్లు, సర్వే, ఉపాధి అవకాశాలు, భూ వివాదాలు తదితరాలకు సంబంధించిన అర్జీదారుల నుంచి 84 అర్జీలు వచ్చాయి.

అర్జీదారులకు సౌకర్యాలు

జిల్లాలో మారుమూల ప్రాంతాల నుంచి తమ సమస్యలు విన్నవించుకోవడానికి వస్తున్న దరఖాస్తుదారుల సౌకర్యార్థం జిల్లా పరిషత్ సమావేశ మందిరం ఆవరణలో టెంటు, కుర్చీలు, తాగునీరు ఏర్పాటు చేయడమే కాకుండా వారికి అల్పాహారం, టీ అందించడం జరుగుతోంది. అలాగే ప్రజా ఫిర్యాదుల నమోదు మరియు పరిష్కార వేదికకు అధిక సంఖ్యలో పంచాయతీరాజ్ శాఖకు సంబంధించిన దరఖాస్తుల వస్తున్నందున ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసి పరిష్కారం వేగవంతం చేసేందుకు తగు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో డీపీవో కె.భారతీ సౌజన్య, జిల్లా ఉద్యాన అధికారి ఆర్.వి.ప్రసాదరావు, జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి అనురాధ, జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డా.టి.వి.బాల మురళీ కృష్ణ, ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ శాంతిశ్రీ , డ్వామా పీడీ బి.సుధాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ కక్షలు ఆపాలి

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఆమదాలవలస నియోజకవర్గంలో కూటమి నాయకులు రాజకీయ కక్షలకు పాల్పడుతున్నారని ఆమదాలవలస నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త చింతాడ రవికుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం మీకోసంలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. రాజకీయ కక్షలతో బూర్జ మండలం నీలాదేవిపురంలో డీలర్‌ను అకారణంగా తొలగించేందుకు చర్యలు తీసుకుంటున్నారని, దీనిని ఆపి ఆ డీలర్‌ను కొనసాగించాలని విన్నవించారు. పొందూరు మండలం ధర్మపురం సచివాలయం ఉద్యోగిని కక్షతో కంచిలి మండలానికి బదిలీ చేశారని, ఆయనను తిరిగి దగ్గరలోకి తీసుకురావాలని కోరారు. అక్రమ బదిలీలు నిలుపుదల చేయాలన్నారు. సరుబుజ్జిలి పాలవలస గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్‌ను రాజకీయ కక్షతో తొలగించారని, అయితే కొత్తవారిని నియమించకుండా నిబంధనలకు విరుద్ధంగా టీడీపీ కార్యకర్తతో ఉపాధి పనులు చేయిస్తున్నారని ఆరోపించారు. సరుబుజ్జిలి మండలం తెలికిపెంట గ్రామ పంచాయతీలో నిధులు సర్పంచ్ తన భర్త ద్వారా దుర్వినియోగం చేస్తున్నారని, దీనిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఆమదాలవలస మండలం జొన్నవలస రోడ్డు వద్ద ఎప్పటి నుంచో నివాసముంటున్న 23 మంది పేదల ఇళ్లను తొలగిస్తున్నారని, వాటిని నిలుపుదల చేయాలని పేర్కొన్నారు. ఇళ్లు నష్టపోయిన వారికి పరిహారంతోపాటు పునరావాసం కల్పించాలని విన్నవించారు. అలాగే పొందూరు మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో సక్రమంగా సేవలందించాల్సిన అవసరం ఉందన్నారు. ఆయనతో పాటు నాలుగు మండలాల కార్యకర్తలు ఉన్నారు.

ఎస్పీ గ్రీవెన్స్‌కు 42 ఫిర్యాదులు



ఫిర్యాదుదారుడి గోడు వింటున్న డీఎస్పీ వివేకానంద

శ్రీకాకుళం క్రైమ్: జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ఎస్పీ గ్రీవెన్స్‌కు 42 ఫిర్యాదులందాయి. ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి ఎచ్చెర్లలో పీఈటీ (కానిస్టేబుల్ దేహదారుఢ్య పరీక్ష) ఎంపిక ప్రక్రియలో ఉన్నందున డీఎస్పీ సీహెచ్ వివేకానంద అర్జీదారుల నుంచి ఫిర్యాదులను స్వీకరించి సకాలంలో పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. అడిషనల్ ఎస్పీల్లో ఒకరు బందోబస్తులో, మరొకరు కేసు విషయమై బయటే ఉండటం.. డీఎస్పీ వివేకానంద సైతం ఆమదాలవలస పోక్సో కేసు, భూ ఆక్రమణల తొలగింపులో శాంతిభద్రతల అదుపునకై సమయం అక్కడ వెచ్చించడంతో గ్రీవెన్స్‌కు వచ్చిన బాధితులు మధ్యాహ్నం 1:15 గంటల వరకు వేచి చూడాల్సివచ్చింది.

సుడా గ్రీవెన్స్‌కు 27 వినతులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): నగరంలోని సుడా కార్యాలయంలో గ్రీవెన్స్ సెల్ సోమవారం నిర్వహించారు. దీనిలో భాగంగా సుడా చైర్మన్ కొరికాన రవికుమార్ 27 వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా కక్షిదారులతో చైర్మన్ మాట్లాడుతూ.. జిల్లావ్యాప్తంగా లేఅవుట్లు అభివృద్ధి చేసేందుకు, తద్వారా ఆదాయ వనరులు పెంచేందుకు తనవంతు సహకారం అందిస్తానన్నారు. అర్జిదారుల సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. మాస్టర్ ప్లాన్ అమలుపై ప్రత్యేక దృష్టి సారించి శ్రీకాకుళంను సుందర నగరంగా తీర్చిదిద్దుతామన్నారు. కార్యక్రమంలో సుడా అధికారులు జేపీవో సీహెచ్ శాస్త్రి, ప్లానింగ్ సెక్రటరీలు పాల్గొన్నారు.



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న చైర్మన్ రవికుమార్

రోడ్డున పడేశారు



జేసీబీతో ఆక్రమణలు తొలగిస్తున్న అధికారులు

- అక్రమ నిర్మాణాలు తొలగింపు
- 40 ఏళ్లుగా అక్కడే నివసిస్తున్నామని బాధితుల ఆవేదన
- ఇళ్ల పట్టాలు మంజూరు చేస్తామని హామీ

ఆమదాలవలస: మండలంలోని చిన్నజొన్నవలస గ్రామంలో సర్వే నంబర్ 108లో ఒకటి, రెండు నంబర్లతోపాటు సర్వే నంబర్ 14లోని మోదుగుల చెరువు గట్టు, ఆర్అండ్‌బీ రహదారికి ఆనుకొని ఉన్న అక్రమ నిర్మాణాలను రెవెన్యూ అధికారులు సోమవారం తొలగించారు. ఇక్కడ సుమారు 25 సెంట్ల స్థలంలో 21 మంది ఇళ్లు, పశువుల శాలలు, దుకాణాలు నిర్మించుకున్నారు. గతంలో చెరువు ఆక్రమణకు గురవుతోందని అదే గ్రామానికి చెందిన రెడ్డి తవుడు, గుండ రాజులు కలెక్టర్ గ్రీవెన్స్, కోర్టును ఆశ్రయించారు. అయితే ఆ కేసుకు సంబంధించి 2023 ఆగస్టులో ఆక్రమణలు తొలగించాలని అప్పటి రెవెన్యూ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అయితేవారు ఈ విషయంలో జాప్యం చేయడంతో ఫిర్యాదుదారులు హైకోర్టును ఆశ్రయించి అప్పటి జిల్లా కలెక్టర్లు శ్రీకేష్ బి.లాఠకర్, జిలాని, ముగ్గురు ఆర్డీవోలు, నలుగురు తహసీల్దార్లపై ఉన్నత న్యాయస్థానంలో కోర్టు ధిక్కారణ కింద కేసు వేశారు. ఈ కేసుకు సంబంధించి కోర్టు ఆదేశాల మేరకు జనవరి 20వ తేదీలోపు ఆక్రమణలు తొలగించకపోతే సంబంధిత అధికారులపై చట్టపరమైన చర్యలు చేపడతామని నోటీసులు రావడంతో, రెవెన్యూ అధికారులు ఆక్రమణలు తొలగించడానికి రంగం సిద్ధం చేశారు.



రోడ్డుపై నిరసన తెలుపుతున్న బాధితులు

ఆక్రమణదారులకు నోటీసులు

ఆక్రమణలు తొలగించాలనే ఆదేశాలతో తహసీల్దార్ ఎస్.రాంబాబు 20 రోజుల క్రితం ఆక్రమణదారులకు నోటీసులు అందజేశారు. ఈ నేపథ్యంలోనే తహసీల్దార్ ఆధ్వర్యంలో డీఎస్పీ సీహెచ్ వివేకానంద, సీఐ సత్యనారాయణ, ఎస్ఐ బాలరాజు, ఎంపీడీవో వెంకట్రావు తదితర అధికారులంతా సోమవారం అక్కడికి చేరుకొని ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టారు. అక్రమ నిర్మాణదారులకు అన్ని శాఖల అధికారులు కలిసి సమన్వయంతో వారిని వారించి, వేరొక చోట ఇళ్ల పట్టాలను అందిస్తామని చెప్పి తొలగింపులు చేపట్టారు. ఆక్రమణలు తొలగిస్తున్న సమయంలో బాధితులు ఆందోళన వ్యక్తం చేస్తూ ఇళ్లను కూల్చివేస్తే తాము ఎక్కడ నివసించేదని లబోదిబోమంటూ కన్నీరు పెట్టుకున్నారు. రహదారికి అడ్డంగా కూర్చొని నిరసన చేశారు. మహిళలు, వృద్ధులు, చిన్నారులతో గత 40 సంవత్సరాలుగా ఆ ప్రాంతంలో నివాసముంటూ జీవనం సాగిస్తున్నామని, గతంలో ఉండే ప్రభుత్వాలు తమకు కుళాయిలు, విద్యుత్ సౌకర్యాలు కల్పించారని పేర్కొన్నారు. ఇప్పుడు ఒక్కసారి తమ బతుకులను రోడ్డుపై పడేయడం తగదని గగ్గోలు పెట్టారు. ఆ గ్రామ సర్పంచ్ గొంటి అనిల్‌కుమార్ అక్కడికి చేరుకొని అధికారులు కొన్ని రోజులు గడువు ఇవ్వాలని కోరారు. దీనికి అధికారులు ఒప్పుకోకపోవడంతో వెనుదిరిగారు. కార్యక్రమంలో ఆర్అండ్‌బీ డీఈ గణపతి, మండల సర్వేయర్ బొడ్డేపల్లి గోపి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ పప్పల గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు న్యాయం చేయాలి



అధికారులు, బాధితులతో మాట్లాడుతున్న రవికుమార్

చిన్నజొన్నవలస గ్రామంలో ఆక్రమణలు తొలగించడంతో 21 కుటుంబాలు నిరాశ్రయులయ్యారు. దీంతో వైఎస్సార్‌సీపీ ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్‌తోపాటు పలువురు నాయకులు వెళ్లి జరిగిన విషయంపై తహసీల్దారు, సీఐలను అడిగి తెలుసుకున్నారు. వారికి కొంత సమయం ఇవ్వాలని కోరారు. అది కుదరదని అధికారులు తేల్చి చెప్పడంతో వారంతా నిరాశ్రయులు అయ్యారని, వారికి వెంటనే ఇళ్లస్థలాల పట్టాలు మంజూరు చేసి ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే వారికి ఇల్లు నిర్మించుకునేందుకు వెంటనే నిధులు మంజూరు చేయాలన్నారు. ఈ నేపథ్యంలోనే వారందరికీ ఆ గ్రామంలో చింతాడ రవికుమార్ టెంట్లు వేయించి, భోజనాలకు ఏర్పాటు చేసి రాత్రి వేళలో అక్కడ ఉండేందుకు ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు గొంటి కృష్ణ, ఈశ్వరరావు, అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

హవ్వా..!

- టీడీపీ నేత ఇంటి నుంచి సీసీ రోడ్డు



మంజూరు కాకపోయినా టీడీపీ నాయకుడు ఇంటి నుంచి నిర్మాణం చేపట్టిన సీసీరోడ్డు



మంజూరైన సీసీరోడ్డు నిర్మాణం చేపట్టాల్సిన రహదారి ఇదే...

సంతబొమ్మాళి: వడ్డించేవాడు మనవాడైతే చివర బంతిలో ఉన్నా కంచంలోకి అన్నీ చేరుతాయనే సామెతలా ఉంది టీడీపీ నాయకుల వ్యవహారం. ప్రభుత్వం తలపెట్టిన పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా సీసీరోడ్డు నిర్మాణాలు నిబంధనలకు విరుద్ధంగా మండలంలోని ఆకాశ లక్కవరం గ్రామంలో జరుగుతున్నాయి. అలాంటి నిర్మాణాలకు అధికారులు వత్తాసు పలకడంతో ఎటువంటి అనుమతులు, మంజూరు లేకపోయినా టీడీపీ నాయకుల ఇళ్లకు సీసీ రోడ్లను వేసుకుంటున్నారు. గ్రామంలో అసిరి తల్లి ఆలయం నుంచి హౌస్‌సైట్ వరకు సీసీ రోడ్డు నిర్మాణానికి గతేడాది ఆగస్టు 23న గ్రామసభ ఆమోదం తెలపగా, అక్టోబర్ 6వ తేదీన పనులు మంజూరయ్యాయి. వర్క్ ఐడీ 020102901/ఆర్‌సీ 9999005242519తో రూ.5 లక్షల నిధులు విడుదలయ్యాయి. అయితే అక్కడ నిర్మాణం చేపట్టకుండా వేరొక చోట నిర్మాణాన్ని చేపట్టారు. గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు పరపటి ఎర్రయ్య ఇంటి వద్ద నుంచి వేరొక చోట వరకు సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణం చేపట్టినా సంబంధిత అధికారులు అలాంటి నిర్మాణాలకు వత్తాసు పలకడం, సమర్థించడం కొసమెరుపు.

రాంగ్ ఎస్టిమేషన్ ఇచ్చారు

అసిరి తల్లి గుడి నుంచి హౌస్‌సైట్ వరకు సీసీ రోడ్డు నిర్మాణానికి రాంగ్ ఎస్టిమేషన్ ఇచ్చారు. దీంతో రూ.5 లక్షలు మాత్రమే మంజూరయ్యాయి. తక్కువ నిధులు మంజూరు కావడంతో అక్కడ నిర్మాణం ప్రారంభించలేదు. అడ్జస్ట్‌మెంట్ చేసి వేరొక చోట సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టాము.

– కె.తేజ, ఇంజినీరింగ్ అసిస్టెంట్, హెచ్ఎన్‌పేట గ్రామ సచివాలయం

సంక్రాంతికి ప్రత్యేక రైళ్లు

ఆమదాలవలస: సంక్రాంతి ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకొని సౌత్‌సెంట్రల్ రైల్వే ధ్వర్యంలో మొత్తంగా 52 రైళ్లు అదనంగా నడపనున్నట్లు ప్రకటించారు. ఇందులోభాగంగా శ్రీకాకుళంరోడ్ (ఆమదాలవలస), చర్లరల్లి, కాచిగూడల మధ్య ప్రత్యేక రైళ్లు వేసినట్లు రైల్వే అధికారులు సోమవారం వెల్లడించారు. ఈ రైళ్లను ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రైలు నంబర్	స్టేషన్లు	డిపార్చర్	అరైవల్	తేదీలు
07025	చెర్లపల్లి–శ్రీకాకుళంరోడ్	19.20	09.00	9,12,14
07026	శ్రీకాకుళంరోడ్- చెర్లపల్లి	14.45	06.00	10,13,15
07041	కాచీగూడ–శ్రీకాకుళంరోడ్	17.45	09.00	7
07042	శ్రీకాకుళంరోడ్- కాచీగూడ	14.45	07.30	8

పోక్సో కేసులో నిందితుడు అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ వివేకానంద

ఆమదాలవలస: పట్టణంలోని గేటు ప్రాంతంలో రెల్లివీధికి చెందిన మైనర్ బాలికపై అదే వీధికి చెందిన కోటిపల్లి రాజు అనే యువకుడు ప్రేమ పేరుతో అత్యాచారం చేశాడు. దీంతో మైనర్ బాలిక గర్భవతి అయినట్లు ఆమె తల్లిదండ్రులు గుర్తించి ఆదివారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు డీఎస్పీ సీహెచ్ వివేకానంద సోమవారం ఆమదాలవలస పోలీస్‌స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నిందితుడు రాజును అదుపులోకి తీసుకొని పోక్సో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు వెల్లడించారు. అలాగే బాధితురాలికి వైద్య పరీక్షలు జరిపించినట్లు తెలిపారు. కోటిపల్లి రాజు నూడిల్స్ షాపులో పని చేస్తున్నాడని, మైనర్ బాలిక ఇంటికి ఎదురింట్లోనే ఉంటున్నాడని పేర్కొన్నారు. ఏడాది కాలంగా వీరిద్దరికీ పరిచయం ఉందని తెలిపారు. కూల్ డ్రింక్‌లో మత్తు మందు కలిపి అత్యాచారం జరిపినట్లు వచ్చిన కథనాలు తప్పు అని స్పష్టం చేశారు. నిందితుడు మైనర్ బాలికను ప్రేమ పేరుతో వంచించి ఆమె ఇష్టం లేకుండా అత్యాచారం జరిపాడని అది చట్టరీత్యా నేరమన్నారు. మైనర్ బాలికలపై అఘాయిత్యాలకు పాల్పడితే ఎంతటి వారైన ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. బాధితురాలికి ప్రభుత్వం నుంచి రావాల్సిన ఆర్థిక సాయం కోసం స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారులకు లేఖ రాయడం జరిగిందని తెలిపారు. సమావేశంలో సీఐ పాండ్రంకి సత్యనారాయణ, ఎస్ఐ సనపల బాలరాజు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

యువకుడు ఆత్మహత్య

టెక్కలి రూరల్: సంతబొమ్మాళి మండలం దండుగోపాలపురం గ్రామంలో అద్దె ఇంట్లో నివాసముంటున్న వావిలాపల్లి సురేష్(25)అనే యువకుడు సోమవారం రాత్రి అద్దెకు ఉంటున్న ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడు విజయనగరం జిల్లా మడక ముడిగాం గ్రామానికి చెందినవాడు. సురేష్ మూలపేట పోర్టులో శ్రీబాలాజీ మెన్ పవర్ సప్లయ్‌లో భోజనాలు అందించే వర్కర్‌గా కొద్దికాలంగా పనిచేస్తున్నాడు. మరో ఇద్దరు వ్యక్తులతో కలిసి రూమ్‌లో ఉంటున్నాడు. అయితే సోమవారం ముగ్గురు కలిసి డ్యూటీకి వెళ్లగా, తిరిగి సాయంత్రం సురేష్ తన రూమ్‌కి వచ్చి ఆత్మహత్య చేస్తుకున్నట్లు స్థానికులు, తోటి స్నేహితులు చెబుతున్నారు. అయితే సురేష్ మృతికి గల కారణాలు తెలియలేదు. యువకుడు మృతి చెందిన విషయం తెలుసుకున్న సంతబొమ్మాళి ఎస్ఐ వై.సింహాచలం ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు. అనంతరం మృతదేహాన్ని శవపంచనామ నిమిత్తం టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు.

62 మద్యం బాటిళ్లు పట్టివేత



పట్టుబడిన మద్యం బాటిళ్లతో పోలీసులు

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో ఉన్నటువంటి పలాస ఇందిరా చౌక్ పోలీసుల తనిఖీల్లో భాగంగా సోమవారం రాత్రి 62 మద్యం బాటిళ్లతో ఇద్దరు యువకులు అరెస్టైనట్లు కాశీబుగ్గ పోలీసుస్టేషన్ సీఐ సూర్యనారాయణ తెలిపారు. వజ్రపుకొత్తూరు మండలానికి చెందిన కర్ని అఖిలేష్, నందిగాం మండలానికి చెందిన అంబటి ఠాగూర్ ఇరువురు స్నేహితులు ద్విచక్ర వాహనంపై తరలిస్తుండగా పట్టుబడ్డారు. వారి వద్ద నుంచి రాష్ట్రానికి చెందిన 47 మద్యం బాటిళ్లు, 15 బీర్లు స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి వాహనాన్ని సీజ్ చేసి కేసు నమోదు చేశామని తెలిపారు.

బలవంతపు భూసేకరణ ఆపాలి

- ఎయిర్‌పోర్టుకు వ్యతిరేకంగా ధర్నా
- 23న కలెక్టరు కార్యాలయం వద్ద నిరసన



పలాస ఆర్డీఓ కార్యాలయానికి ఊరేగింపుగా వెళ్తున్న ఉద్దానం ప్రాంత రైతులు, ప్రజాసంఘాల నాయకులు

పలాస: ఉద్దానం ప్రాంతంలో కార్గో ఎయిర్‌పోర్టు నిర్మాణానికి బలవంతపు భూసేకరణ ఆపాలని డిమాండ్ చేస్తూ జిల్లా నలుమూలల నుంచి వచ్చిన వామపక్ష పార్టీలు, వివిధ ప్రజా సంఘాల నాయకులు పలాస ఆర్డీఓ కార్యాలయం వద్ద సోమవారం ధర్నా చేశారు. పలాస ఆర్టీసీ కాంప్లెక్సు నుంచి ఆర్డీఓ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆర్డీఓ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా అక్కడ వామ పక్షాలకు చెందిన నాయకులు మాట్లాడుతూ పచ్చని ఉద్దానంలో అక్కడ ప్రజలకు ఎలాంటి ఉపయోగం లేని ఈ ఎయిర్‌పోర్టు నిర్మాణం ఎవరి కోసమని ప్రశ్నించారు. వెంటనే ఈ ప్రతిపాదనను ప్రభుత్వం విరమించుకోవాలని కోరారు. దశల వారీగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని, ఈ నెల 23న కలెక్టరు కార్యాలయం ఎదుట నిరసన చేస్తామని చెప్పారు. మూలపేట పోర్టు వద్ద కేటాయించిన 2279 ఎకరాల్లో ఎయిర్‌పోర్టుకు కనీసం 300 ఎకరాలు కేటాయిస్తే సరిపోతుందని, పచ్చని ఉద్దానంలో చిచ్చు పెట్టొద్దని ప్రభుత్వాన్ని వారు కోరారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, సీపీఐ కార్యదర్శి సీహెచ్ వేణు, సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి తాండ్ర ప్రకాష్, లిబరేషన్ నాయకులు మద్దిల రామారావు, సీపీఐఎం ఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్రనాయకులు వి.మాధవరావు, ఎస్.గణపతి, కె.కేశవరావు, తెప్పల అజయ్‌కుమార్, డి.శ్రీనివాసరావు, పి.కుసుమ, పి.దుర్యోధన, కె.పురుషోత్తం, జోగి అప్పారావు, రామస్వామి, హెచ్ వల్లభరావు, లండ భోజరాజు, చలపతి తదితరులు పాల్గొన్నారు.